క్లుప్తంగా

అభివృద్ధికి సహకరించాలి



పెర్కిట్(ఆర్మూర్): బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధికి సహకరించాలని ఆలూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్ అన్నారు. మండల కేంద్రంలో అభివృద్ధి పనులను అడ్డుకోవడానికి బీజేపీ నాయకులు అధికారులను బెదిరించడంపై సోమవారం కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. విజయ్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను అడ్డుకుంటే గ్రామంలో తిరగనివ్వమని హెచ్చరించారు. నాయకులు కల్లెం మల్లారెడ్డి, నవనీత్, ఉదయ్, ముత్యం, కుంట నారాయణ, గుత్ప చిన్నయ్య, నారాయణ, భాస్కర్, వంశి, సాయి, ధర్మపురి, గంగాధర్, శశి, శ్రీకాంత్, భరత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు



మాక్లూర్: ప్రజలు బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ సరిత పేర్కొన్నారు. మండలంలోని దుర్గానగర్ కిందితండాలో సోమవారం ఎన్ఎస్ఎస్ శిబిరం ముగిసింది. కార్యక్రమానికి సరిత హాజరై, మాట్లాడారు. సమాజంలో మహిళల ప్రాధాన్యతను గుర్తు చేస్తూ గ్రామంలోని మహిళలను సన్మానించారు. ప్రిన్సిపాల్ లావణ్య, జీపీ కార్యదర్శి స్వాతి, పద్మమ్మ, సుమలత, శ్వేత పాల్గొన్నారు.

పన్నులను వందశాతం వసూలు చేయాలి



రుద్రూర్: గ్రామాల్లో పన్నులను ఈ నెల 20లోపు వందశాతం వసూలు చేయాలని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా సిబ్బందిని ఆదేశించారు. కోటగిరి ఉమ్మడి మండలంలో పన్ను వసూళ్ల కోసం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. జీపీ కార్యదర్శులు, కారోబార్‌లు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన



బోధన్: రెంజల్ మండలంలోని బాగేపల్లి శివారులో సోమవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్ హుస్సేన్ వరి పంటపొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏఈవోలు చేసిన పంట నమోదు వివరాలను పరిశీలించారు. రైతులు సురేందర్‌గౌడ్, శంకర్‌గౌడ్, సతీష్, ప్రవీణ్, ఇస్మాయిల్, సుదర్శన్ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



బోధన్: విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రెంజల్ ఎంఈవో కులకర్ణి గణేష్‌రావు సూచించారు. మండలంలోని దూపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడారు. వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సోమలింగం గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణులే మోదీ కుటుంబం



వర్ని: భారతదేశంలో ఉన్న బీజేపీ కార్యకర్తలు, ప్రజలందరూ మోదీ కుటుంబమే అని బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్ వెల్లడించారు. వర్నిలో సోమవారం మోదీ మేరా భాయ్– హమ్ మోదీ పరివార్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీకి కుటుంబమే లేదు అని ప్రతిపక్షాలు ఆరోపించడం సమంజసం కాదన్నారు. నాయకులు రమేష్, కల్యాణ్, గంగాధర్, రజనీకాంత్ ఉన్నారు.

నిధుల మంజూరు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని గౌడ సంఘానికి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ. 4లక్షలు మంజూరయ్యాయి. ఆర్మూర్‌లోని ఎంపీ క్యాంప్ ఆఫీస్‌లో సోమవారం ఎంపీ అర్వింద్ గౌడ కుల సంఘం సభ్యులకు నిధుల ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. పార్టీ నేత మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీకి సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చింత ప్రవీణ్, రెంజెర్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా?

- డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం పేదల ఎదురుచూపులు
- ఆర్మూర్ పరిధిలో పూర్తికాని ఇళ్ల పనులు



పెర్కిట్‌లో కొనసాగుతున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు

పెర్కిట్(ఆర్మూర్): పేదలకు సొంతింటి కల అందని ద్రాక్షగా మారుతోంది. గత ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం కింద ఇళ్లను అందజేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. కాగా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్న నిర్మాణాలు పూర్తి కాలేదు. దీంతో అర్హులైన పేదలు ఇళ్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఇందిరమ్మ పథకంపై ఆశలు..

ఇటీవల ఎన్నికల్లో ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాలను అందజేస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈక్రమంలో పార్టీ మేనిఫెస్టో ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పేదలకు ఇళ్లను అందజేస్తామని ప్రకటించింది. స్థలం ఉన్నవారికి నిర్మాణం కోసం రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. ఇందులో భాగంగా నెల రోజుల క్రితం చేపట్టిన ప్రజాపాలనలో దరఖాస్తులు సైతం స్వీకరించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన నిర్మాణాలు పూర్తికాక, ప్రస్తుత ప్రభుత్వం ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులను గుర్తించడంలో జాప్యం నెలకొనడంతో నిరుపేదలు తమ సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందోనని ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పేదలకు ఇళ్లను అందించాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఆర్మూర్ పట్టణంతో పాటు మున్సిపల్‌పరిధిలోని పెర్కిట్, మామిడిపల్లి, మండలంలోని అంకాపూర్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంలో 160 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా అందులో 136 ఇళ్లు పూర్తి కావస్తున్నాయి. మిగతా 24 అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే మామిడిపల్లిలో 100 ఇళ్ల పనులు ఇంకా కొనసాగుతున్నాయి. మండలంలోని అంకాపూర్‌లో 165 ఇళ్లు నిర్మించాలని సంకల్పించగా 112 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. దీంతో పాటు పెర్కిట్‌లో చేపట్టిన 100 ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తికావస్తోంది. కాగా కొన్ని చోట్ల రోడ్లు, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించడంలో జాప్యం నెలకొంది. అలాగే కొన్ని చోట్ల స్లాబులు నిర్మించి వదిలేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతుండడంతో పేదల్లో నిరాశ నెలకొంది.



అంకాపూర్‌లో..

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, సామగ్రి అందజేత



పెర్కిట్(ఆర్మూర్): కోమన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు సోమవారం పట్టణానికి చెందిన వైద్యుడు ముత్యంరెడ్డి సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. అలాగే పాఠశాలకు కుర్చీలను వితరణ చేశారు. క్లబ్ ప్రతినిధులు పట్వారి గోపికృష్ణ, తులసి, ప్రవీణ్ పవార్, హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిపేటలో..



నందిపేట: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సోమవారం 1989–90 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు అందజేశారు. సిలిండర్ లింగం, మురళీధర్ గౌడ్, సాయిరాం, మోహన్, గంగారెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వర్ని మండలంలో..



వర్ని: మండలంలోని శ్రీనగర్, పాత వర్ని, సత్యనారాయణపురం ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, ఇతర విద్యార్థులకు బ్యాగులను మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పీవీ సుబ్బారావు, కేఆర్ఎస్ ఠాగూర్, శివనాగేశ్వరరావు, దొరబాబు పాల్గొన్నారు.

మోర్తాడ్ మండలంలో..



మోర్తాడ్: మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు విలువల పుస్తకాలను సోమవారం సుంకం రాములు, ఆండాలమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు కొనుగోలు చేసి పంపించారు. వాటిని విద్యార్థులకు హెచ్ఎం అందచేశారు.

ఆర్మూర్ మున్సిపల్‌పై కలెక్టర్ శీతకన్ను

ఆర్మూర్‌టౌన్: అవిశ్వాస విషయంలో గందగోళం నెలకొందని, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆర్మూర్ మున్సిపల్‌పై శీతకన్నుతో వ్యవహరిస్తున్నారని ఆర్మూర్ మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి ఆరోపించారు. సోమవారం ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్మూర్ మున్సిపల్‌లో అవినీతి అక్రమాలు తారస్థాయికి చేరినా కలెక్టర్ స్పందించడం లేదన్నారు. ఇప్పటికైన ఆర్మూర్ మున్సిపల్‌పై కలెక్టర్ దృష్టిసారించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తం

రవన్న వర్ధంతి సభ



నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలో సోమవారం సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో ఉద్యమ నాయకుడు రవన్న వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు రాజలింగం, వంజరి గంగాధర్, ఆనంత్, వెంకట్, మల్లన్న, ఉమ్మడి గంగారం తదితరులు పాల్గొన్నారు

రామాలయానికి రూ.2లక్షల విరాళం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాంనగర్ రామాలయానికి దాత (దొండి అనుసూయ, మారుతి) రూ. రూ. 2,00,116లు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గంగామోహన్ చక్రు, గుద్దెటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ



రుద్రూర్: మండలంలోని రాయకూర్ సింగిల్ విండో కార్యదర్శి గంగారాం సోమవారం పదవీ విరమణ చేశారు. ఈసందర్భంగా పాలకవర్గ సభ్యులు ఆయనను సన్మానించారు. విండో చైర్మన్ పరుచూరి సంఘమేశ్వర్‌రావ్, వైస్ చైర్మన్ తోట అరుణ్ కుమార్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



వర్ని: మండలంలోని జలాల్పూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను సోమవారం ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు ప్రారంభించారు. ఎలమంచిలి శ్రీనివాస రావు, దశరథ్, సురేష్‌బాబా, రాజిరెడ్డి, వెంకటిగౌడ్, బుజ్జన్న పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి మండలంలో..



కమ్మర్‌పల్లి: మండలంలోని హసకొత్తూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎంఈవో ఆంధ్రయ్య భూమిపూజ చేశారు. నాయకులు పడిగెల ప్రవీణ్, రేవతి గంగాధర్, గోపిడి లింగారెడ్డి, నోముల నరేందర్, కుందేటి శ్రీను పాల్గొన్నారు.

నర్సాపూర్ చలివేంద్రం..



కమ్మర్‌పల్లి: మండలంలోని నర్సాపూర్‌లో శ్రీలక్ష్మీనరసింహాస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ పెంట ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జీరో కరెంట్ బిల్లుపై హర్షం



డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రభుత్వం జీరో కరెంట్ బిల్లును అమలు చేయడంపై డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం డొంకేశ్వర్‌తో పాటు తొండాకూర్, దత్తాపూర్, నికాల్‌పూర్, జీజీ నడ్కుడ, సిర్పూర్, నూత్‌పల్లి, అన్నారం గ్రామాల్లో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన కుటుంబాలకు జీరో కరెంట్ బిల్లులను అందజేశారు. నాయకులు గంగాధర్, ఫరీద్, రాజన్న, సుమన్, హరీశ్ ఉన్నారు.

మోర్తాడ్ మండలంలో..



మోర్తాడ్: మోర్తాడ్ మండల కేంద్రంతో పాటు, ఏర్గట్ల మండలం దోంచందలో పలువురికి ఉచిత విద్యుత్ బిల్లులను కాంగ్రెస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బోధన్: బోధన్ ఆర్డీవోగా శ్రీరాం దత్తు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు మంచిర్యాలలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)గా విధులు నిర్వర్తించిన శ్రీరాం దత్తు బదిలీపై ఇక్కడికి వచ్చారు. బోధన్ ఆర్డీవోగా పని చేసిన రాజాగౌడ్ బదిలీపై ఆర్మూర్ వెళ్లారు.

ఎన్నికల బాండ్ల వివరాలు తెలపాలి



ఆర్మూర్‌లో ఎస్బీఐ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్/బోధన్: ఎస్బీఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో వివిధ రాజకీయ పార్టీల ఎన్నికల బాండ్ల వివరాలను ప్రజల ముందుంచాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సీపీఎం, సీపీఐ(ఎం) పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ఆర్మూర్, బోధన్‌లోని ఎస్బీఐ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం రాజకీయ పార్టీల ఎన్నికల బాండ్ల వివరాలను తెలపాలని బ్యాంక్ మేనేజర్లకు వినతి పత్రం అందజేశారు. నాయకులు సిద్ధల నాగరాజు, ఎస్కే అమీర్, జవహర్ సింగ్, రఫీక్, శంకర్‌గౌడ్, యేశాల గంగాధర్, కుమార్‌స్వామి, గోపి, గోవింద్, సాగర్ పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్)/ రుద్రూర్/ బోధన్/ బాల్కొండ: జిల్లాకేంద్రంలో ఆదివారం ఎస్ఎంటీ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని, ప్రతిభ చాటారు. పెర్కిట్ వాగ్దేవి పాఠశాల, కోటగిరి శ్రీవేద హైస్కూల్, సాలూర వాగ్దేవి స్కూల్, బాల్కొండ కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొని, ఉత్తమ ప్రతిభ కనబరిచి, బహుమతులు సాధించారు. సోమవారం విద్యార్థులను ఆయా పాఠశాలల నిర్వాహకులు అభినందించారు.

ద్వాదశ దినకర్మ



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి నానమ్మ గంగవ్వ ద్వాదశ దినకర్మ నిర్వహించారు. ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ హాజరై, గంగవ్వకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నాయకులు గడుగు గంగాధర్, కేశవేణు, షేక్ మున్ను, సాయిబాబా ఉన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

బోధన్: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. రంజాన్ పండుగ ప్రారంభం నేపథ్యంలో సోమవారం రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు మతసామరస్యత, సంయమనం పాటించాలన్నారు. రూరల్ సీఐ నరేష్ ఎస్సై రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

మనిషి జన్మను సార్థకం చేసుకోవాలి



రుద్రూర్: భగవంతుడు ఇచ్చిన మనిషి జన్మను మంచిగా వినియోగించుకుని సార్థకం చేసుకోవాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోతంగల్ మండలం హంగర్గా బీసీ కాలనీలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ సోమవారం ముగిసింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై పూజలు చేశారు. జెడ్పీటీసీ శంకర్ పటేల్, పోతంగల్ విండో చైర్మన్ శాంతీశ్వర్ పటేల్, నీరడి గంగాధర్, సీరాజ్ ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



మోర్తాడ్: మండలంలోని పాలెం గ్రామంలో సీతారామస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన సోమవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రంజిత్ శర్మ ఆధ్వర్యంలో హోమం , ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా రాజరాజేశ్వరస్వామి జాతర



వేల్పూర్: మండలంలోని మోతె గ్రామంలో రాజరాజేశ్వరస్వామి జాతర సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, బలిహరణం, రథోత్సవం నిర్వహించారు. భక్తులకు వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఆవరణలో కాంగ్రెస్ ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి నిర్మించిన పర్మినెంట్ షెడ్‌ను నందీశ్వర మహారాజ్ పూజలు చేసి ప్రారంభించారు. సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, ప్రశాంత్‌గౌడ్, నరేష్, చరణ్ రెడ్డి పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధిపై అవగాహన కల్పించాలి



సులేమాన్‌నగర్‌లో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

రుద్రూర్: లెప్రసీ వ్యాధిపై సర్వే నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని కోటగిరి ఉమ్మడి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. మండలంలోని సులేమాన్‌నగర్ ఆరోగ్య కార్యకర్తలు నిర్వహిస్తున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ (ఎల్‌సీడీసీ) సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈనెల 24వరకు సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. సర్వేలో ఆరోగ్య కార్యకర్తలు అనంత లక్ష్మీ, జ్యోతి, ఆశావర్కర్లు లక్ష్మీ, పర్వానా పాల్గొన్నారు.

రెంజల్ మండలంలో..

బోధన్: రెంజల్ మండలంలోని వీరన్నగుట్ట, దూపల్లి, కూనేపల్లి గ్రామాల్లో హెల్త్ సబ్ సెంటర్లను రెంజల్ పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి శ్రావణ్‌కుమార్ తనిఖీ చేశారు. గ్రామాల్లో స్థానిక ఆశావర్కర్లు, వైద్య సిబ్బందితో కలిసి ఇంటింట లెప్రసీ సర్వే నిర్వహించారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

బోధన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, ఫాసిస్ట్ విధానాలను వ్యతిరేకంగా పోరాడాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. మండలంలోని అమ్దాపూర్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు తమ హక్కులు, సమానత్వం, లింగ వివక్షతకు వ్యతిరేకంగా సంఘటితంగా ముందుకెళ్లాలన్నారు. మాజీ సర్పంచ్ సిర్ప మంజుల, నాయకులు మల్లేష్, నర్సక్క, నాగమణి, బీపాషా బేగం, రేహానా బేగం, కవిత పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంబురాలు



బాల్కొండ: ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం 21శాతం ఫీట్‌మెంట్‌తో పీఆర్సీ పెంచడంతో సోమవారం బాల్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సంస్థ సిబ్బంది సంబురాలు నిర్వహించారు. కార్మికులతో కలిసి స్వీట్లు పంచిపెట్టుకున్నారు. నాయకులు వెంకటేశ్, శ్రీనివాస్, కపిల్, యూనిస్ పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీ చైర్మన్ పెంట భోజారెడ్డిపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సొసైటీ కార్యాలయంలో సోమవారం డీసీవో శ్రీనివాసరావు సమక్షంలో బల నిరూపణ నిర్వహించారు. అవిశ్వాసం నెగ్గడానికి తొమ్మిది మంది డైరెక్టర్లు కావాల్సి ఉండగా 8 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో చైర్మన్‌పై అవిశ్వాసం వీగిపోయినట్లు డీసీవో ప్రకటించారు. ప్రస్తుత చైర్మన్ పెంట భోజారెడ్డి సంవత్సరం పాటు కొనసాగనున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

బోధన్: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని రెంజల్ ఎంపీడీవో శంకర్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. నీలా, కందకుర్తి, పేపర్‌మిల్లు గ్రామాల్లో సోమవారం ఎంపీడీవో పర్యటించి, నర్సరీలను పరిశీలించారు. ఆయా పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులతో మాట్లాడారు. గ్రామాల్లో వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని సూచించారు. సిబ్బంది శ్రీనివాస్, రాణి, అఫ్రీన్, సతీష్‌చంద్ర ఉన్నారు.

సమాచారం..

నేడు మేకల సంత వేలం

నవీపేట: మండలకేంద్రంలో మేకల సంతతోపాటు, కూరగాయల సంతలకు మంగళవారం వేలం వేస్తున్నట్లు జీపీ కార్యర్శి రవీందర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది మేకల సంతకు రూ. 55 లక్షలు, కూరగాయల సంతకు రూ. 14 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. గడువు ముగియడంతో తాజాగా మళ్లీ వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వ్యాపారులు రూ. లక్ష డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మోస్రా మండల సభ

వర్ని: మోస్రా మండల సర్వసభ్య సమావేశం మంగళవారం రైతు వేదికలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు అధ్యక్షతన జరుగు ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – బులెట్ (తెలుగు) – 10.25
సైతాన్ (హిందీ) – 1.15, 7.00
బాబు (తెలుగు) – 4.15
ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) – 10.00

స్క్రీన్-2 – గామి (తెలుగు) – 12.00, 3.10, 6.20, 9.30

స్క్రీన్-3 – భీమా (తెలుగు) – 12.30, 3.35, 6.40, 9.45